







# ఖరీదు

శ్రీనివాసా క్లినిక్ ఆవరణలో తెల్లని మల్లెపువ్వు రంగు ఇంపాలా కారు, ఆ హాస్పిటల్ అందాన్ని హోదాని ఇనుమడింపచేస్తున్నాది.

డాక్టర్ సుధీర్ పేషంట్లను చూడడం ఆపి రిస్టువాచీ చూసుకున్నాడు. మరుక్షణం ఏదో గుర్తుకొచ్చినట్టె సీట్లోంచి లేచాడు.

డాక్టరుగారు వెళ్ళిపోతారేమోనని కంగారు పడ్డారు మిగిలిన రోగులు. అప్పటికే కొన్నిగంటల నుండి కళ్ళల్లో ఒత్తులేసుకుని ఎదురుచూడగా అతని దర్శనమైంది. దాంతో తమ బాధలు నివృత్తై పునర్జన్మ కలిగినట్లుగా మహదానందం పొందారు. ఐతే మధ్యంతరంగా లేచి వెళ్ళిపోతే మళ్ళి ఎప్పుడొస్తారో? ఏమో? నన్న బెంగ, భయం ప్రతీఒక్కరి కళ్ళలో కొట్టొచ్చినట్లు కనబడుతున్నాయి.

సుధీర్ హుందాగా కారువైపునడిచాడు. అతని మెడలోని స్టెతస్కోపు నీలకంఠునినాగులా పొగరుగా వయ్యారంగా అటూ ఇటూ నర్తిస్తోంది.

"డాక్టర్ బాబూ!

ఆ పిలుపుకు కారెక్కబోయిన సుధీర్ వెనుతిరిగాడు.

నడివయసులో ఉన్న ఒకవ్యక్తి సొమసిల్లిపోయిన పాపను భుజాన వేసుకొని కంగారుగా పరిగెత్తుకుంటూ రావడం అతనికంటపడింది.

ఆ క్షణం అతడి ముఖంలో చిరాకు, విసుగుదల ద్యోతకమౌతున్నాయి.

"బాబూ!... డాక్టర్‌బాబు... నాబిడ్డ సావుబతుకుల్లో వుంది. తమరియేల వుంటారో,

ఉండరోనని బయపడిసచ్చాను. తమరుండారు..."

అతడి కళ్ళలో దైన్యం, బిడ్డఏమైపోతుందోనన్న బెదురు. వీటన్నిటితో అతని కంఠం పూడుకుపోయింది. అందుకే అతని గొంతునుంచి అస్పష్టంగా మాటలూడిపడు తున్నాయి.

"నా కిప్పుడు టైమ్ లేదు.లయన్స్‌క్లబ్‌లో సన్మానం ఉంది"

"అలా అనకండయ్యా తొందరగా తమరు నాబిడ్డకేసి సూడండి. తమ సల్లని సేయి నా బిడ్డమీద పడితే చాలు బతుకుతాది"

బ్రతిమలాడసాగాడా వ్యక్తి

"కావాలంటే నేనొచ్చేవరకు ఆ బల్లమీద పడుకోబెట్టు" కారెక్కాడు సుధీర్.

అతడి దృష్టిలో ఒక ప్రాణం కన్నా ఒక సన్మానం విలువైందేమో!"

"బాబూ... డాట్టర్‌బాబు... తమరిప్పుడు నాబిడ్డను సూడకుంటే అది మా అందర్ని ఇడిచిపెట్టి ఎల్లిపోద్ది. తల్లిలేని కూన. దయ తలచండిబాబూ! ఆ లారీ యదవ కళ్ళునెత్తిమీద యేట్టుకొని...

అతడి మాటలు పూర్తి కాకుండానే "యాక్సిడెంటా?"అంటూ ఇంతలేసికళ్ళు చేసాడు డాక్టర్.

"అవును బాబూ తమరేం చేస్తారో ఏటో నా బిడ్డను రచ్చించాలి" చేతులు జోడిస్తూ ప్రాధేయపడసాగాడా ఆసామి.

"యాక్సిడెంట్ కేసుమేము టేకప్ చేయకూడదు. గవర్నమెంట్ హాస్పిటల్‌కు తీసుకుపో" అని ముందుకు సాగాడు డాక్టర్.

"ప్రభుత్వా హాస్పత్రి ... ఎక్కుడుందది ... ఇరవై మెళ్ళావతల. అక్కడికి వెళ్లేంత వరకు తన చిన్నారి ప్రాణం ఉంటుందా?... ప్రమాదంలో ఉన్న మనిషికి మందేసి రక్షించడానికి ఏ డాక్టరైతేనేం?... ఎవరు విధించారీ ఆంక్ష?... ఎందుకెట్టినట్లు ? ..." జవాబు దొరకని ప్రశ్నల్తో సతమత మవుతూ ముందుకు సాగాడావ్యక్తి.

ప్రభుత్వ సారా మార్జ్యూల గ్రామాల్లో కూడా విరివిగా దొరుకుతున్న ఈరోజుల్లో సగటు మనిషి కన్నీటి తుడుపుకై ప్రభుత్వ డాక్టర్లిచ్చే రంగునీళ్ళకూడా దొరకని గ్రామమది. చూట్టానికి లంకంత ఉంది. జనాభాకాగితాల మీద ఇరవై వేలకు తక్కువ కాకుండా చూపిస్తున్నారు. కాని ఏం లాభం? కనీస సదుపాయం కూడా లేకుండా పోయిందా ఊరికి. దానికి కారణం లేకపోలేదు. ఆ ఊరు మోతుబరి రాజకీయ నాయకుడైన శేషాచలం పట్నంలో వైద్యం

చదువుకుంటున్న తన కొడుకు సుధీర్ చేత ఆ ఊళ్లో ప్రైవేట్ ప్రాక్టీస్ పెట్టించి రెండు చేతులా ఆర్జించాలనే కోరికవల్లే గవర్న్మెంట్ డిస్పెన్సరి రాకుండా గత అయిదు ఆరెళ్ళుగా తంటాలు పడుతూ వచ్చాడు. తత్ఫలితంగా ఈనాడు నోట్లు గుమ్మరిస్తేగాని మందు అందుబాటులో లేకుండా పోయిందా ఊరివాళ్ళకి.

ఎలాగైనా సరే బిడ్డను బ్రతికించుకోవాలన్న పట్టుదలతో దారిన పోయే మెటాడోర్న్ ఆపి వాడు అడిగినంత కిరాయి చెల్లించి పట్నం చేరుకొని ప్రభుత్వాసుపత్రికి వెళ్ళాడు.

సాయంత్రం ఆరుఅవుతోంది.

గవర్నమెంట్ హాస్పటల్ ఎంతో హడావుడిగా వుంది.

పిల్లను భుజాన వేసుకొని డాక్టర్ కోసం వెర్రివాడిలా వరండాలన్ని తిరుగుతున్నాడు. కనిపించిన ప్రతీనర్సుని డాక్టర్గారు ఎక్కడ ఉన్నారని అడిగాడు. కాని వారినుండి ఆశించిన సమాధానం రాలేదు. తన కడుపుకోత ఎవరూ అర్థంచేసుకోరేం?... కనీసం తోటిమనిషన్న సానుభూతికూడా లేదేం ఇక్కడ వాళ్ళకి?... మరెందుకీ వైద్యశాలలు? ఎవర్ని ఉద్ధరించడానికని?..." ఇటువంటి సవాలక్ష ప్రశ్నలు అతడి హృదయాన్ని రంపంతో కోస్తున్నాయి.

అంతలో అదేదో గదిలోంచి డాక్టర్ గారు రావడం గమనించి అటువైపు పరిగెత్తాడెంతో ఆశతో.

"నేను డ్యూటి దిగిపోతున్నాను. మరో డాక్టర్గారు వస్తారు. అంతవరకు అలాకూర్చో" తనను గాని, తన బిడ్డను గాని చూడకుండానే అన్నాడు డాక్టర్.

"లేదు బాబూ ఇప్పటికే శానా ఆలశ్యం అయిపోనాది. సుడిగాలిలా లారీ తన మీదకు దూసుకురావడంతో భయపడిపోయి ప్రక్కనున్న కాలువలోకి గెంతేసింది. మొఖకులు, చేతులు చెక్కుకుపోనాయి. భయపడిపోవడంవల్ల స్పృహ తప్పిపోనాది. గవర్నమెంట్ డాక్టర్ తప్ప ఇంకెవరు నా కూనను ముట్టుకోకూడదంటా. అందుకే ఇంత దూరం పరిగెత్తుకుంటూ వచ్చాను. మీకు పున్యం వుంటాది. నా బిడ్డను బ్రతికిం చండయ్యా" డాక్టర్ గారి కాళ్ళు పట్టుకున్నాడు అతుడువెళ్ళిపోతాడన్నభీతితో.

అతడి ఆవేదనకు డాక్టర్ హృదయం ద్రవించినట్లుంది. భృకుటిముడిచి క్షణం ఆలోచించాడు.

'ఇతక ఆలశ్యం సేయకండయ్యా ఎలాగైన తమరే నా బిడ్డను రచ్చించాలి. అన్నాడు ఆసామి.

"సరే ఆ గదిలో బల్లమీద పిల్లను పడుకోబెట్టు" అని చెప్పి సిరంజిలో మందేదో ఎక్కించి తెమ్మనమని నర్సుని ఆదేశించాడు.

తన మొర ఆలకించి కరుణించినందుకు డాక్టర్‌కు మనసులోనే కృతజ్ఞతలు తెలుపుకున్నాడా నిర్భాగ్యుడు.

నర్సుపట్టుకొచ్చిన సిరంజిని అందుకొని ఆ పిల్లకు ఇంజక్షన్ చేస్తూ "సూదెక్కడం లేదు చచ్చిందాన్ని తీసుకొచ్చావేమయ్యా?... తీసుకెళ్ళావతలకు" అంటూ చక చకా అక్కడ్నుండి వెళ్ళిపోయాడు డాక్టర్.

డాక్టర్ గారి మాటలకు నెత్తిమీద పిడుగుపడ్డట్టయిందావ్యక్తికి. అయితే తన బిడ్డ ప్రాణాలు ఎప్పుడో అనంతవాయువుల్లో కలిసిపోయాయన్నమాట. పాపమీద ఉన్న మమకారంతో బతుకుతుందన్న ఆశతోనే తనింతవరకు తాపత్రయ పడుతూ వచ్చాడు. కాని ఏం లాభం?... ఏ హాస్పటల్‌లో ఏవైద్యుడు తన వంకగాని, తన బిడ్డవంకగాని కన్నెత్తి చూడలేదు. తనేం పాపంచేశాడు? అందర్నీ వీళ్ళిలాగే అలక్ష్యంచేస్తారా? తన ఊళ్ళో డాక్టరు ప్రభుత్వ హాస్పత్రికి పొమ్మనకుండా వెంటనే వైద్యం చేసివుంటే బిడ్డ బ్రతికేది కాని అంతా కలిసి తన పాపను హత్య చేసారు. సూది పొడిచే వరకు మనిషి ప్రాణం వుందో లేదో తెలుసుకోలేని అర్హతలేని సిఫార్సులతో వచ్చిన డాక్టర్లు, ప్రతీ సంస్థలో ప్రతీపనికి చేయి చాపే వ్యవస్థ మారనంతకాలం తనలాంటివాళ్ళకు తనవంటి చిన్న సైజు ప్రాణాలకు విలువుండదేమోనని అతడి మూగ మనసుఘోషించింది.

